గర్భిణులకు చీరల పంపిణీ



జవహర్‌నగర్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని జవహర్‌నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, నాగరాణి దంపతులు అంగన్‌వాడీ కేంద్రంలో దాదాపు 100 మంది గర్భిణులకు పసుపు కుంకుమ, చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళ కమిటీ సభ్యులు బుడిగ సవితగౌడ్, మౌనికారెడ్డి, రజిత, వసంత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే లక్ష్య సాధన



మాట్లాడుతున్న డా.అనురాధ

పోచారం: విద్యార్థులు ఎంపిక చేసుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతర కృషి అవసరమని లైఫ్ సైన్స్ నిపుణులు డా. అనురాధ జాజు అన్నారు. శుక్రవారం యంనంపేట్‌లోని రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మోటివేషనల్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తుకు మార్గాలు, అందుబాటులో ఉన్న వనరులపై స్పష్టత లేకపోవడం వల్ల విద్యార్థులు అనిశ్చితి, అయోమయానికి గురవుతున్నారనిన్నారు. ఉన్నత ఆశయాలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రేరణాత్మకమైన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థులు రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

సరైన సమయంలో వైద్యం అందాలి



కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం

మేడ్చల్‌రూరల్: గుండెపోటు, ఇతర క్లిష్ట పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన సమయంలో వైద్యం అందితేనే ప్రాణాలు దక్కుతాయని మెడిసిటీ వైద్య కళాశాల సీఈవో డాక్టర్ ఐనిష్ రెడ్డి, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ శివరామకృష్ణ అన్నారు. మెడిసిటీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని మెడినోవా హాస్పిటల్‌లో జాతీయ వాస్క్యులర్ డే సందర్భంగా వాస్క్యులర్ సర్జరీ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వయస్సుతో సంబంధం లేకుండా యువకుల నుంచి వృద్ధుల వరకు గుండెపోటుతో మరణిస్తున్నారన్నారు. గుండెపోటుకు గురైన 45 నిమిషాల సమయాన్ని గోల్డెన్ అవర్ భావిస్తారని, ఆ సమయంలో వైద్య సేవలు అందితే ప్రాణాపాయం ఉండదన్నారు. నిజామాబాద్, మెదక్, కామారెడ్డి తదితర జిల్లాలకు చెందిన ప్రజలు ట్రాఫిక్ రద్దీగా ఉండే నగరానికి చేరుకునే వరకు సమయం మించిపోతుందన్నారు. స్థానికులతో పాటు మేడ్చల్ పరిసర ప్రాంత జిల్లా ప్రజల వైద్య సౌకర్యార్థం వాస్క్యులర్ సర్జరీ విభాగం వివిధ రకాల అత్యాధునాతన సేవలను సేవా దృక్పథంతో ప్రారంభించినట్లు తెలిపారు. వాస్క్యులర్ విభాగాన్ని మొట్ట మొదట వైద్యం చేయించుకున్న మెదక్ జిల్లా కర్నాల్‌పల్లికి చెందిన కుమ్మరి లక్ష్మితో ప్రారంభించారు. డాక్టర్ సత్యేంద్ర రామ్‌నాథ్ మాట్లాడుతూ వాస్క్యులర్ సర్జరీ విభాగం ద్వారా డయాబెటిక్, ఫుట్ గ్యాంగ్రీన్, వరికోస్వెయిన్స్, ఫిస్టులా సర్జరీలు, స్ట్రోక్ రాకుండా క్యారోటెడ్ సర్జరీలను చేయవచ్చని తెలిపారు. వాస్క్యులర్ డేను పురస్కరించుకుని, ఆగస్టు నెలలో ఉచిత కన్సల్టేషన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ, మెడినోవా డాక్టర్లు డాక్టర్ సల్మాన్, డాక్టర్ గీత, డాక్టర్ సోనియా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు- బైక్ ఢీ

ఒకరి మృతి



రాజు మృతదేహం

శామీర్‌పేట్: కారు, బైక్ ఢీ కొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన శుక్రవారం జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా, వాసాలమర్రికి గ్రామానికి చెందిన పర్వతం రాజు (30) శుక్రవారం బైక్‌పై తుర్కపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో కారులో ఎదురుగా వస్తున్న రాజు అనే వ్యక్తి బైక్‌ను ఢీ కొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో పర్వతం రాజు అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ స్థలాలు.. దుర్గంధానికి ఆవాసాలు!

చెత్తాచెదారం, ముళ్లపొదలతో దోమలకు నిలయంగా మారుతున్న వైనం

- చుట్టుపక్కల ఉండే వారికి తప్పని ఇబ్బందులు
- ఓనర్ల నిర్లక్ష్యం.. పట్టించుకోని శివారు పురపాలక సంఘాలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగరంతో సహా శివారు పురపాలక సంఘాల పరిధిలోని జనావాసాల్లో ఖాళీ స్థలాల్లో పెరుకపోయిన చెత్తాచెదారం, ముళ్లపొదలు, మురుగు నీటితో సమీప కాలనీ, ప్రాంత, బస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఓనర్ల నిర్లక్ష్యం.. పురపాలక సంఘాల అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలు పడరాని పాట్లు పడాల్సివస్తోంది. ఇటీవల వరుసగా పడుతున్న వర్షాలతో నగరంతో సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని పలు పురపాలికల్లో డ్రైనేజీ సమస్య కూడా తలెత్తుతోంది. పురపాలిక చట్టం ప్రకారం ఖాళీ స్థలాల్లో శుభ్రంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ఓనర్లదే. లేదంటే పురసంఘాల అధికారులు స్థలం యజమానికి నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాల్సి ఉంటోంది.

- శివారు జిల్లాల పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్లతో సహా బోడుప్పల్, పీర్జాదిగూడ నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉండగా, దమ్మాయిగూడ ,నాగారం,పోచారం, ఘట్కేసర్ , గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్ ,పెద్ద అంబర్‌పేట్ ,తుక్కుగూడ,ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి , షాద్‌నగర్, శంషాబాద్ , శంకర్‌పల్లి ,తుర్కంజాల్,మణికొండ , నార్సింగ్, ఆదిభట్ల ,అమనగల్లు (ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు,27 మున్సిపాలిటీలు)మున్సిపాలిటీలలోని పలు కాలనీల్లో ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రతకు నిలయంగా నిలుస్తున్నాయి.





గ్రీన్ బెల్టు తదితర స్థలాల్లోనూ ...

ప్రైవేటు ప్లాట్ల సంగతి ఇలా ఉంటే.. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, డంపింగ్‌యార్డులు అంతర్గత, ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రీన్ బెల్టు తదితర స్థలాలు చెత్తకుండీలుగా, మురుగునీటి నిలయాలుగా మారుతున్నాయి. పందులు, కుక్కలకు ఈ ప్రాంతాలు ఆవాసాలుగా మారుతున్నాయి. నిర్మాణ వ్యర్థాలను, భోజన, ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ దారిలో డంపు చేస్తున్నారు. ప్రతి ఏటా పట్టణ ప్రగతి, ఇతర ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు సందర్భంగా వీటిని శుభ్రం చేసేందుకు రూ. లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

మ్యుటేషన్‌కు దూరంగా...

ప్లాట్లు ఖరీదు చేసేవారు రిజిస్ట్రేషన్ తర్వాత పురపాలికల్లో తమ పేరిట ఆస్తి మార్పిడి చేయించుకోవాలి. దీని వల్ల డబుల్ రిజిస్ట్రేషన్ ప్రమాదాన్ని నివారించవచ్చు. ఆస్తి మార్పిడితో సదరు స్థలం ఆస్తి పన్ను పరిధిలోకి వస్తోంది. దీన్ని తప్పించుకునేందుకు మ్యుటేషన్‌కు దూరంగా ఉంటున్నారని అధికారులు అంటున్నారు. ఖాళీ స్థలాల మ్యుటేషన్, అసెస్‌మెంట్‌పై దృష్టి సారిస్తే, ఖాళీ స్థలాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీ చేయవచ్చు. నోటీసుకు స్పందించని చోట, పురపాలికల ఆధ్వర్యంలో శుభ్రపరిచి సదరు ఖర్చులను వసూలు చేసే అవకాశం ఉంది. అప్పటికీ స్పందించని పక్షంలో స్వాధీనం చేసుకుని, రుసుం చెల్లించే దాకా నిర్మాణ అనుమతులను నిరాకరించవచ్చు. నిబంధనల అమలుపై పురపాలక సంఘాల అధికారులు దృష్టి పెట్టాల్సిఉంది.

పర్యవేక్షణ లేక..

స్థల ఓనర్లు తమ ప్లాట్లలో మురుగు, వర్షం నీరు నిలవకుండా, పిచ్చి మొక్కలు పెరగకుండా, ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాల్సిన్నప్పటికీ పట్టించుకోవటం లేదు. దీన్ని పర్యవేక్షించాల్సిన పురపాలిక అధికారులు పట్టించుకోవటం లేదు. ఖాళీ పాట్ల ఓనర్ల వివరాలు తెలియక పురపాలక సంఘాలు నోటీసులు ఇవ్వటం లేదు. వాస్తవంగా స్థలం మార్కెట్ విలువలో 0.5 శాతం ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ) చెల్లించాల్సి ఉంటోంది. ఇదీ వసూలు కావడం లేదు. పురపాలికల పరిధిలో ఎన్ని ఖాళీ స్థలాలు ఉన్నాయోనన్న పూర్తి వివరాలు కూడా సిబ్బంది వద్ద లేవని తెలుస్తోంది.



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- జవహర్‌నగర్ పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

జవహర్‌నగర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అదించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం భవనం చుట్టూ తిరిగి పరిసరాలను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటామని, భవన నిర్మాణానికి కావాల్సిన నిధులు మజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మ, సిబ్బంది పాల్గొన్నారు.



జవహర్‌నగర్ పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి, డీఎంహెచ్ ఉమాగౌరీ

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు

ఘట్‌కేసర్: శ్రావణ శుక్రవారం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో వరలక్ష్మి వ్రత పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కళకాలం సౌభాగ్యవతిగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటూ ఇరుగు పొరుగు మహిళలకు వాయనం ఇచ్చిపుచ్చుకున్నారు.



భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

శామీర్‌పేట్: భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మూడుచింతలపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... భూ భారతి ఆన్‌లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు ఎంత వరకు పరిష్కారమయ్యాయని స్థానిక తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి కారణాలపై ఆరా తీశారు. సాంకేతిక పరమైన ఏమైన ఇబ్బందులు ఉంటే వెంటనే క్లియర్ చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆన్‌లైన్, మ్యానువల్ గా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అదనపు కలెక్టర్ పరిశీలించారు.



చేయూత పెన్షన్లు పెంచాలి

పోచారం: చేయూత పెన్షన్లు పెంచాలని పెన్షన్‌దారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అన్నోజిగూడలోని వికలాంగుల కాలనీలో చేయూత పెన్షన్‌దారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారుల సమాఖ్య నాయకులు మాట్లాడుతూ.. వికలాంగులకు రూ. 6 వేలు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ. 4 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 13న ఘట్‌కేసర్‌లోని గురుకుల్ పాఠశాల ప్రాంగణంలో జరిగే చేయూత పెన్షన్‌దారుల సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు తిప్పరపు లక్ష్మణ్ మాదిగ, కేశపాగ రాంచందర్, పంగ ప్రణయ్, మొక్క ఉపేందర్, గడ్డం అంజి, బాలనర్సయ్య, పద్మ పాల్గొన్నారు.

ఈత చెట్లు నాటేందుకు స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్ కుమార్

కీసర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళిక క్రింద నాగారం మున్సిపల్ పరిధిలో ఈత వన అభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగించేందుకు చర్యలు చేపట్టినట్లు నాగారం మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఎక్సైజ్‌శాఖ సూపరిండెంట్ నవీన్‌కుమార్‌తో కలిసి మున్సిపల్ పరిధిలో ఈత చెట్లను నాటేందుకు తగిన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఈత చెట్ల నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈత వనాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు గొప్ప మద్దతుగా మారుతుందన్నారు. దీంతో పాటు మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాల్లో మరిన్ని వివిధ రకాల మొక్కలను నాటేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ సంతోష్‌కుమార్, మేనేజర్ సురేష్‌రెడ్డి, బాల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో బీఆర్ఎస్ సహాయక చర్యలు

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని షఫీనగర్, ద్వారకమాయికాలనీ, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాలను గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరదనీరు ముంచెత్తడంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు వంశీ ముదిరాజ్, ఎండీ ఉస్మాన్ అర్ధరాత్రి ఆయా ప్రాంతాలకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. హైడ్రాతో పాటు జీహెచ్ఎంసీ సిబ్బందికి సమాచారం అందించి వరదనీరు సాఫీగా వెళ్లేలా తగిన చర్యలు చేపట్టారు.



విద్యార్థులకు చేయూతనందిస్తాం

మల్కాజిగిరి: విద్యార్థులకు చేయూత అందించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఎల్లప్పుడూ ముందుంటుందని క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సర్దార్ పటేల్‌నగర్‌లోని అంగన్వాడీ కేంద్రానికి మైక్ సెట్ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే క్లబ్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్సీ జీడీ శ్రీధర్‌గౌడ్, జెడ్సీ పి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి నటరాజ్, గణేష్, వెంకట నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మల్కాజిగిరి: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. శుక్రవారం ఆయన ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ షిరిడీనగర్, ఎన్ఎండీసీ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ గతంలో మల్కాజిగిరి సర్కిల్‌లో చిన్నపాటి వర్షానికి కాలనీలు ముంపునకు గురయ్యేవన్నారు. బండచెరువు కింది ప్రాంతాల్లో ఉన్న కాలనీల్లో బాక్స్ డ్రైన్ల నిర్మాణం చేపట్టిన తర్వాత ముంపు సమస్య తగ్గిపోయిందన్నారు. వర్షాలను ఎదుర్కొవడానికి హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి , ఉమేష్‌సింగ్, వెంకటేష్‌యాదవ్, సత్యమూర్తి, శ్రీనివాస్, నిరంజన్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

రాఖీ పండుగను శుక్రవారం మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థి, విద్యార్థినులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని సోదరభావం చాటారు. పలువురు మహిళా నేతలు వివిధ పార్టీల నాయకులు, అధికారులు, అనధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

– మేడ్చల్ జోన్ బృందం



తోటి విద్యార్థులకు రాఖీలు కదుతున్న విద్యార్థినులు



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌కు రాఖీ కడుతున్న మాజీ కౌన్సిలర్ అమరం సరస్వతి



నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డికి రాఖీ కడుతున్న మహిళ





సెరినిటీ స్కూల్‌లో..

కీసరగుట్ట, చీర్యాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కీసరగుట్టలో..



చీర్యాల దేవాలయంలో..



కీసర: కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వరస్వామి దేవస్థానం, చీర్యాల శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, కీసర సమీపంలోని సాయి ధామం తదితర దేవస్థానాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. కీసరగుట్టలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ తటాకం నారాయణ దంపతులు, చీర్యాల దేవాలయంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ దంపతులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అర్చకులు శ్రావణమాసంలో నిర్వహించే వరలక్ష్మీ పూజ విశిష్ఠతోపాటు, కలిగే శుభాలను భక్తులకు తెలియజేస్తూ వరలక్ష్మీ వ్రతాలను కొనసాగించారు. సాయిధామంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సుధాకర్‌రెడ్డి, ధర్మకర్త మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సాయిధామంలో..